TGTEL/25/A0827

# ప్రజా దివాన్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 155 | శనివారం 30-05-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

## ‘నైరుతి’ రాక మరింత ఆలస్యం

- నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యం
- జూన్ 4 లేదా 5న కేరళ తీరానికి చేరే అవకాశం
- ముందుగా మే 26న వస్తాయని ఐఎండీ అంచనా
- ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాల వేగం తగ్గింది
- కేరళ తర్వాత 2-3 రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశం
- గతేడాది మే 24నే కేరళను తాకిన నైరుతి
- ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షాల సూచన
- జూన్‌లో పలు రాష్ట్రాల్లో వడగాలుల హెచ్చరిక



మిగతాది 2లో

## జవాబుదారీతనం ఉండాల్సిందే..

### నీట్ పేపర్ లీక్‌పై సుప్రీం

నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేజి 2లో ▶



# ఎస్ఐఆర్‌పై నేతలంతా సంపూర్ణ అవగాహనతో ఉండాలి: సీఎం రేవంత్

**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)తో తలెత్తే సమస్యలపై నాయకులందరికీ సంపూర్ణ అవగాహన ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.**

**ఎస్ఐఆర్ వల్ల లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులు, దళితులు, మైనార్టీలు మరియు మహిళల ఓట్లు పోయే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.**

హైదరాబాద్: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)తో తలెత్తే సమస్యలపై నేతలంతా సంపూర్ణ అవగాహనతో ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులకు ఎస్ఐఆర్ పెద్ద సమస్య కావొచ్చన్నారు.

“ఎస్ఐఆర్‌తో దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే అవకాశముంది. దీనివల్ల తలెత్తే సమస్యలపై నేతలకు పూర్తి అవగాహన ఉండాలి. ఎస్ఐఆర్ కోసం అన్ని నియోజకవర్గాల్లోనూ ఇన్‌ఛార్జ్‌లను నియమించాలి. వారు సరిగా పనిచేస్తే ఒక్క ఓటు కూడా తొలగించకుండా చూడొచ్చు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను 10 రోజులకోసారి కలుస్తాను. నెలలో 3 రోజులు కార్యకర్తల కోసం సమయం కేటాయిస్తా. నాతో సహా అందరూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందే. బూత్ ఎన్‌రోలర్ల సాయంతో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ సభ్యత్వాలు చేయించాం.





## దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు తెలంగాణ నుంచే:

### మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో 13వేల వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 2 లక్షల మంది సిబ్బంది సేకరణలో పాల్గొంటున్నారని చెప్పారు. సేకరణ కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులు పంపామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.11,050 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని వివరించారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

“ధాన్యం సేకరణకు బిహార్, బెంగాల్ కార్మికులపై ఆధారపడి ఉన్నాం. బెంగాల్ ఎన్నికలకు కార్మికులు స్వస్థలాలకు వెళ్లి రావడం ఆలస్యమైంది. మద్దతు ధర కోసం మా ప్రభుత్వం రూ.49 వేల కోట్లు వెచ్చించగా.. గత ప్రభుత్వం రూ.10వేల కోట్లే ఇచ్చింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయి. దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ. ఈ మాట కేంద్రమే చెప్పింది. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొనుగోళ్ల కంటే ఇప్పుడు ఎక్కువ కొంటున్నాం. కేంద్ర ప్రభుత్వ విధానాలు పాటిస్తూ చెప్పిన దానికంటే అదనంగా కొనుగోలు చేశాం.

దీనికోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో చివరి గింజ వరకు

## న్యాయవాది స్విమ్మింగ్‌కు వెళ్తుండగా స్కార్పియోతో ఢీకొట్టి హత్య: సీపీ సజ్జనర్



హైకోర్టు న్యాయవాది ఖాజా మొహిజుద్దీన్ హత్య కేసును ఛేదించామని హైదరాబాద్ సీపీ సజ్జనర్ తెలిపారు. ప్రమాదంలా కనిపించిన ఈ ఘటన వెనుక పక్కా కుట్ర ఉందని.. దర్యాప్తులో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని చెప్పారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీపీ వెల్లడించారు.

2లో

## కాసర్ల పద్మకు కెటిఆర్ నివాళి

### పార్థివ దేహం వద్ద పుష్పాంజలి

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ పార్థివదేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. గుండెపోటుతో కాసర్ల పద్మ మరణించారనే వార్త తెలియగానే హుటాహుటిన హైదరాబాద్ నుంచి బయల్దేరి ఆయన సిరిసిల్లకు వచ్చారు.



## కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు

- కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి
- స్వచ్ఛ గోదావరిపై జూన్ 25 నాటికి పూర్తిస్థాయి నివేదిక
- అధికారులను ఆదేశించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

'స్వచ్ఛ గోదావరి– పవిత్ర పుష్కరాల' నేపథ్యంలో అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు చేరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని కోసం జూన్ 25 లోపు పూర్తి స్థాయి నివేదికతో 'స్వచ్ఛ గోదావరి' ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఆరు జిల్లాల పరిధిలో 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. వీటిని మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని, మురుగునీరు నేరుగా గోదావరిలో కలవకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. మురుగు నీటి నిర్వహణ, పారిశ్రామిక వ్యర్థాల కాలుష్యంపై పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

పేజి 2లో ▶



## కిరణ్ కుమార్ సేవలు ఆదర్శనీయం





- విభిన్న విభాగాల బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహణ
- శాఖ నిబంధనలపై అపారమైన పట్టు
- ఆంధ్రప్రదేశ్ శకటం రూపకల్పనలో కీలక పాత్ర
- కుటుంబం కంటే పనికే మొదటి ప్రాధాన్యత
- పదవీ విరమణ చేసిన అదనపు సంచాలకులు

2లో

## రూ.1500 కోట్ల భూమి కబ్జాకు వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా యత్నం:



హైదరాబాద్: నకిలీ పత్రాలతో గండిపేటలో రూ.1500 కోట్ల విలువైన భూమి కబ్జాకు వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహా కొందరు యత్నించారని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. పేజి 2లో ▶

## కేఎన్ఆర్ బ్యాంకు లావాదేవీలు చూస్తే అవాక్కవ్వాల్సిందే: పట్టాభి



మంగళగిరి: గతంలో జగన్‌కు పీఏగా పనిచేసిన కేఎన్ఆర్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాల లావాదేవీలు చూస్తే అవాక్కవ్వాల్సిందేనని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ అన్నారు. పేజి 2లో ▶

# సంపాదకీయం

## మోదీ సర్కార్‌కు 'బొద్దింకల' బెదురు!

సర్వవ్యాపక జీవి బొద్దింక మన రాజకీయ పరిభాషలో భాగం కావడానికి చాలా కాలం ముందే అది నా పాత్రికేయ పదావళిలో ఒక భాగంగా ఉండేది. జర్నలిజంపై నా ప్రసంగాలలో నేను తరచు పాత్రికేయులను బొద్దింకలతో పోల్చుతూ ఉండేవాణ్ణి. ఎందుకు? రేపు, ప్రపంచం ఒక మహా అణ్వాయుధ దాడికి (అది సంభవించకుండా ఉండుగాక) గురైతే బతికి బయటపడే జీవి బొద్దింక ఒక్కటే కదా. మానవాళి విధ్వంసాన్ని బ్రేకింగ్ న్యూస్‌గా నివేదించేందుకు ఎవరో ఒకరు తప్పనిసరిగా అవసరమమవుతారు. ఆ ఎవరో ఒకరు పాత్రికేయులు కాక మరెవరు?

సమాజ సమస్యలను పరిష్కరించడంలో దేశ రాజకీయ వ్యవస్థ ఘోర వైఫల్యం పట్ల పెల్లుబుకుతోన్న ఆగ్రహావేశాలను 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆకస్మిక ఆవిర్భావం నిండుగా ప్రతిబింబించింది. పాలనను అవినీతిమయం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహరిస్తున్న భయానక అంధకారాన్ని ఎత్తిచూపేందుకు మురికి తావుల్లో నడయాడే కీటకం బొద్దింకను నిరసనకారులు ఒక ప్రతీకగా తీసుకున్నారు. పాలకులు అంతకంతకూ చక్రవర్తుల్లా ప్రవర్తిస్తున్న ఒక రాజకీయ విశ్వంలో మనం ఉన్నాం. అధికారాలను విచక్షణారహితంగా చెలాయిస్తున్న పాలకులను గట్టిగా ఎదుర్కోలేనిరీతిలో ప్రతిపక్షం చీలిపోయి ఉన్న రాజకీయ విశ్వమది. ఈ వికృత రాజకీయ విశ్వంలోకి బొద్దింక పాకుకుంటూ వచ్చింది.

అసహ్యకరమైన కీటకాన్ని చిహ్నంగా స్వీకరించిన ఒక అసాధారణ వ్యంగ్య నిరసన ఉన్నపాటున ఒక ఉద్యమంగా పరిణమించింది. సుదూర అమెరికన్ విశ్వవిద్యాలయంలో ఉన్న ఒక అజ్ఞాత రాజకీయ సందేశ వ్యూహకర్త ఈ ఉద్యమాన్ని ఆరంభించి భారతదేశ అధికార నడవాలలో ప్రకంపనలు సృష్టించాడు. భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన (పూర్తిగా అనవసరమైన) 'బొద్దింక' వ్యాఖ్యలు పురికొల్పిన ఆన్‌లైన్ వేలం వెర్రి ప్రపంచ అతి పెద్ద రాజకీయ పార్టీ, మహాశక్తిమంతమైన భారత రాజ్య వ్యవస్థను తీవ్రంగా కలవరపరిచింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఒక కేసు విచారణ సందర్భంగా 'కొంతమంది యువకులు ఉద్యోగాల్లేక, చేస్తున్న పనిలో గుర్తింపు లేక బొద్దింకల్లా అన్ని చోట్లకు విస్తరిస్తున్నారు. వారు మీడియా, సోషల్ మీడియా, ఆర్టీఐ కార్యకర్తలుగా మారి వ్యవస్థలపై దాడి చేస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఒక డిజిటల్ తిరుగుబాటుకు దారి తీశాయి. ఆగ్రహం ఆ తిరుగుబాటును ఉసిగొల్పగా వ్యంగ్యం దానికి అసాధారణ శక్తినిచ్చింది.

సీజేపీ ఒక రాజకీయ పార్టీ కూడా కాకపోవడం ఈ బొద్దింకల ఉద్యమాన్ని మరింత ఆకర్షణీయమూ, ఆసక్తిదాయకమూ చేస్తోంది. దానికొక నాయకుడు లేడు, ఇంచుమించు 150 కోట్ల ప్రజలతో అపార వైవిధ్యాలతో అలరారుతున్న దేశంలో చాలావరకు సైబర్ స్పేస్‌లోనే జరుగుతున్న ఉద్యమం యథాతథ పరిస్థితులకు ముప్పు కాబోదు. అయినా నరేంద్ర మోదీ నాయకత్వంలోని పాలనా వ్యవస్థ సీజేపీ గురించి ఎందుకు అంతగా ఆందోళన చెందుతోంది? విదేశీ నిధులతో జరుగుతున్న ఉద్యమమని సీజేపీని మోదీ ప్రభుత్వ మంత్రులు విమర్శించారు. దాని అనుయాయుల్లో చాలా మంది పాకిస్థాన్‌లో ఉన్నారని మోదీ సర్కార్ మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా హ్యాండిల్స్‌కు అవరోధాలు కల్పించారు. వాటిని తమ ఆన్‌లైన్ దాడులకు లక్ష్యంగా చేసుకున్నారు సీజేపీ వెనుక ఆమ్ ఆద్మీ పార్టీ పరోక్ష ప్రమేయమున్నదని పలువురు ఆరోపించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ సామాజిక మాధ్యమాలలో పనిచేసినవాడు కావడమే ఆ ఆరోపణకు ఆధారం.

అధికారపక్షంలో ఈ ఆందోళనకు నాలుగు కారణాలు ఉన్నాయి. మొదటిది-- తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు రాజకీయ కథనాల నియంత్రణపై పెద్ద ఎత్తున ఆధారపడిన ప్రభుత్వం మోదీ సర్కార్. దాని పాలన రేయింబవళ్ల వాణిజ్య ప్రచారంలా సాగుతోంది: విజయాలను ఘనంగా చెప్పుకోవడం, వైఫల్యాలను పూర్తిగా కప్పిపుచ్చడం, సరికొత్త నినాదంతో ముందుకు సాగడం. ఏటా కోటి ఉద్యోగాల సృష్టి ఒక స్వప్నంగానే మిగిలిపోయింది. రైతుల ఆదాయాలు రెట్టింపు కావడమనేది జరగనే లేదు. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఆగనే లేదు. అయినా ప్రభుత్వ అధ్వాన పనితీరును పాలకుల కథనాలు పూర్తిగా కప్పిపుచ్చుతున్నాయి. అయితే ఇంటర్నెట్ బొద్దింకలు ఈ ప్రభుత్వ కథనాలను విశ్వసించేందుకు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. ఈ తిరస్కారమే ప్రభుత్వాన్ని తీవ్రంగా కలవరపరుస్తోంది.

రెండోది-- యువత ఆగ్రహం. ఎన్నికలలో జయాపజయాలను అది నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందనేది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. జీడీపీ అంకెలు పతాక శీర్షికలవుతున్నాయి. జాతీయవాద భావోద్వేగాలు ఉధృతమవుతున్నాయి. అయినా ఒక అంతులేని అభద్రతా భావంతో నేటి తరం సతమతమవుతోంది. లక్షలాది విద్యావంతులకు ఉద్యోగ అవకాశాలు అంతకంతకూ తగ్గిపోతున్నాయి. పరీక్షల ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. ఆర్థిక వ్యవస్థ పురోగతి అస్తుబిస్తుగా ఉన్నది. యువ భారతీయులలో నెలకొన్న అసంతృప్తి నైరాశ్యంలోకి జారిపోతోంది. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు శ్రద్ధ చూపడం లేదన్నది యువత ప్రధాన ఆరోపణ. వారి ఆగ్రహం భావజాలపరమైనది మాత్రమేకాదు, పూర్తిగా వ్యక్తిగతమైనది కూడా.

ఇది ఇటీవలి ఎన్నికలలో స్పష్టంగా కన్పించింది. ముఖ్యంగా తమిళనాడులో విజయ్ రాజకీయ సంచలనంలో సంప్రదాయ రాజకీయాల పట్ల యువ ఓటర్ల అసహనం పూర్తిగా ప్రతిబింబించింది. దేశవ్యాప్తంగా యువ ఓటర్లు అంతకంతకూ కాలం చెల్లిన రాజకీయ ద్వంద్వాల -- వామపక్షాలు వర్సెస్ మితవాద పక్షాలు, ఉన్నత వర్గం వర్సెస్ ప్రజాకర్షక వాదం,--ను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు. భవితనిచ్చే నవ్యత, వాస్తవికత, భావోద్వేగ బాంధవ్యాలకోసం వారు ఆరాటపడుతున్నారు. ఇంటర్నెట్ ద్వారా విశాల, విస్తృత సమూహాలను సమీకరించే మీమ్ సంస్కృతి వారి నిరసనను వ్యక్తం చేసే భాషగా మారింది. కాక్రోచ్ జనతా పార్టీకి ప్రాణవాయువుగా ఉన్న ఈ మీమ్ సంస్కృతి, బహుశా ఆ పార్టీకి సంబంధించి చాలా తక్కువగా అర్థం చేసుకున్న విషయమని విశదమవుతుంది. వ్యంగ్యం ఒక రాజకీయ ఆయుధమయింది. నిరంకుశ పాలనా వ్యవస్థలు ఆశ్చర్యకరంగా తరచు ఈ పదునైన శస్త్రాన్ని నెదుర్కోలేక ఆత్మరక్షణలో పడుతుంటాయి. ప్రతిపక్షాల ప్రసంగాలు, టెలివిజన్ చర్చలు, ఆగ్రహ సంపాదకీయాలను అవి సంబాళించుకుంటాయి. ఎందుకంటే అవి సుపరిచితమైన సమరాస్త్రాలే. అయితే పరిహాసాన్ని తట్టుకోవడం చాలా కష్టం. దానిని అణచివేయడం మరీ అసాధ్యం. ఒక పత్రికా ప్రకటన కంటే ఒక మీమ్ వడివడిగా విస్తృత ప్రభావాన్ని నెరపుతుంది. మీమ్ ది కాంతివేగం! చాలా జాగ్రత్తగా పెంపొందించుకుని పటిష్ఠం చేసుకున్న పేరు ప్రతిష్ఠలను ఒక ఎత్తి పొడుపు లేదా పరుషోక్తి ఒక క్షణంలో కూల్చివేస్తుంది. పరిహాసానికి పవిత్ర వస్తువు అనేది ఏమైనా ఉంటుందా? ఉండదు. అధికారం ఎప్పుడైతే ఎగతాళికి గురవుతుందో అప్పుడే దాని ప్రాభవ కాంతులు మసకబారడం ప్రారంభమవుతుంది.

మూడోది-- సీజేపీ ఘోషించిన అంశాలన్నీ ప్రగాఢంగా ప్రతిధ్వనిస్తున్నాయి: పెచ్చరిల్లుతోన్న నిరుద్యోగిత; ప్రశ్న పత్రాల లీక్‌లు; పాదుకుపోయిన అవినీతి; అనైతిక పార్టీ ఫిరాయింపులు; ఆప్తులు, ఆశ్రితులు, ఆస్తిపరుల ప్రయోజనాల పరిరక్షణకే పాలనా వ్యవస్థ ప్రాధాన్యమివ్వడం మొదలైనవి. ఈ 'బొద్దింకల' ఉద్యమం ఒక గందరగోళ వ్యవహారంగా కనిపించవచ్చు; అప్పుడప్పుడూ ఆదర్శాల ఆరాటం లేదా నైరాశ్యాల నిరుత్సాహంలో ఉన్న కుర్రకారు కదన కాహళిగా విన్పించవచ్చు గానీ అది అసంఖ్యాక యువత నిజమైన ఆందోళనలే ఆధార భూమికగా ఉన్న అపూర్వ ఉద్యమమది. యువతను పీడిస్తున్న వ్యాకులతలను తొలగించడంలో ఘోరంగా విఫలమైన సంప్రదాయ రాజకీయాలను నిరసిస్తున్న పెనుకేక అది.నాల్గవది-- అంతకంతకూ బలపడుతోన్న ప్రతి నిరంకుశ పాలనా వ్యవస్థ, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను జాతి వ్యతిరేక చర్యగా చట్టవిరుద్ధం చేసేందుకు ప్రయత్నిస్తుంది. విమర్శను అసమ్మతిగా భావించడానికి బదులు ఒక కుట్రగా పరిగణిస్తుంది. అధికారాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ క్రమంగా కుదించుకుపోతూ చివరకు వ్యంగ్య వ్యాఖ్యలను సైతం తన మనుగడకు ముప్పుగా చూడడం ప్రారంభమవుతుంది. ఇదిగో, ఇటువంటి సందర్భాన్నే సీజేపీ సృష్టించింది.

ఎడిటర్ రవికుమార్

## కేఎన్ఆర్ బ్యాంకు లావాదేవీలు చూస్తే అవాక్కవ్వాల్సిందే: పట్టాభి

మొదటి పేజీ తరువాయి

ఎవరి ఖాతాల్లోకి ఎన్ని రూ.కోట్లు వెళ్లాయో ఒక్కొక్కటీ బయటకు వస్తున్నాయని తెలిపారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీ4 పథకం ద్వారా పేదలను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు ఆలోచన చేశారని అన్నారు. గొడ్డలి పార్టీకి కూడా ఒక పీ4 ఉందని.. అదే.. 'పవర్, ప్రాపర్టీ, పైసా, పార్ట్‌నర్‌షిప్' అని ఎద్దేవా చేశారు.

"అడ్డగోలుగా ఆస్తులు సంపాదించడం.. ఖజానాలో సొమ్ములు నింపుకోవడమే గొడ్డలి పార్టీ పీ4. పవర్, ప్రాపర్టీ, పైసా, పార్ట్‌నర్‌షిప్ ద్వారా అనేక మంది లబ్ధిపొందారు. కేఎన్ఆర్ భార్యకు సంబంధించిన బ్యాంకు ఖాతా పరిశీలిస్తే రూ.20 కోట్ల లావాదేవీలు జరిగాయి. ఒక సాధారణ పీఏ అర్ధాంగి బ్యాంకు ఖాతాలోకి రూ.20కోట్లు ఎలా వచ్చాయో చెప్పాలి. తిరుపతి, జగ్గయ్యపేట, దర్శి, భోగాపురం ప్రాంతాల్లో ఎకరాలకు ఎకరాలే ఉన్నాయి. బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ, కడప, తిరుపతిలో హైక్లాస్ అపార్టుమెంట్లు, విల్లాలు ఉన్నాయి. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటకలో ఆస్తులు విస్తరించాయి. జర్నలిస్టుగా ఉంటూ చిన్న వ్యాపారాలు చేసి సంపాదించారని బుకాయిస్తున్నారు. సొంత ఇల్లు కూడా లేని సీనియర్ జర్నలిస్టులు వందలమంది ఉన్నారు. సాధారణ పీఏగా ఉన్న వ్యక్తి.. ఇన్ని కోట్లు, బంగారం ఎలా సంపాదించారు. రూ.కోట్ల ఆస్తులు ఎలా సంపాదించవచ్చో నేర్పించేందుకు కేఎన్ఆర్ ట్రైనింగ్ సెంటర్ పెట్టుకోవచ్చు" అని పట్టాభి విమర్శించారు.

## రెండ్రోజుల మహానాడు దిగ్విజయం

అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో నెల్లూరులో జరగాల్సిన మహానాడు 2026ను అందరి ఆమోదంతో హైబ్రిడ్ విధానంలోకి మార్చామని మంత్రి లోకేశ్ గుర్తు చేశారు. తెలుగుదేశం రాజకీయ పాఠశాలలో గురువు చంద్రబాబు నాయుడు సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మనకు నేర్పారని చెప్పారు. ఆ నేర్పును ఇంటర్నేషనల్ క్రైసిస్‌లో కూడా ఎవరూ ఊహించని విధంగా హైబ్రిడ్ మహానాడును ఒక అవకాశంగా తీసుకుని విజయవంతం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో మాదిరి ఒకచోట జరిగే మహానాడుకు తెలుగు రాష్ట్రాల నుంచి టీడీపీ కుటుంబసభ్యులు తరలివచ్చేవారని పేర్కొన్నారు. తెలుగుదేశం నా బాధ్యత అంటూ ఇప్పుడూ ప్రతి పల్లె, ప్రతి ఇల్లూ మహానాడుకు వేదిక అయి.. పసుపు జెండాలతో రెపరెపలాడిందన్నారు. కార్యకర్తలే అధినేతలై.. నేతలే మార్గదర్శులై రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్ల బాధ్యతలను తామే తీసుకుని మహానాడు 2026ను కనివినీ ఎరుగనీ రీతిలో విజయవంతం చేశారని చెప్పారు.

## న్యాయవాది స్విమ్మింగ్‌కు వెళ్తుండగా స్కార్పియోతో ఢీకొట్టి హత్య: సీపీ సజ్జనర్

మొదటి పేజీ తరువాయి

"ఈ నెల 23న ఉదయం మొహిజుద్దీన్ స్విమ్మింగ్‌కు వెళ్తుండగా స్కార్పియో వాహనంతో నిందితులు ఢీకొట్టి హత్య చేశారు. వాహనానికి నంబర్ ప్లేట్లు లేకుండా వచ్చి ఢీకొట్టారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించాం. ప్రత్యేక బృందాలతో వారిని అదుపులోకి తీసుకున్నాం. వక్ఫ్ ఆస్తులు, ట్రిబ్యునల్ కేసుల వివాదాలే హత్యకు ప్రధాన కారణంగా విచారణలో వెల్లడైంది. ప్రధాన కుట్రదారుడు ముజాహిద్ ఆలంఖాన్‌ను అరెస్ట్ చేశాం. మొహిజుద్దీన్ హత్య కోసం రూ.15 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

హరియాణాలోని పానిపట్‌లో కిషన్ అలియాస్ పప్పును అదుపులోకి తీసుకున్నాం. జనవరి నుంచి న్యాయవాది కదలికలపై నిందితులు రెక్కీ నిర్వహించారు. హత్య కోసం ప్రత్యేకంగా స్కార్పియో వాహనం కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. డ్రైవర్ అభిజిత్ అలియాస్ నాని వాహనం నడిపి హత్య చేసినట్లు గుర్తించాం. నిందితుల నుంచి రూ.10.10 లక్షల నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. హత్యకు ఉపయోగించిన స్కార్పియో వాహనాన్ని సీజ్ చేశాం. నిందితుల్లో మరికొంతమంది పరారీలో ఉన్నారు.. వారి కోసం గాలింపు కొనసాగుతోంది" అని సజ్జనర్ వివరించారు.

## కిరణ్ కుమార్ సేవలు ఆదర్శనీయం

మొదటి పేజీ తరువాయి

సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘ కాలం పాటు విశేష సేవలు అందించిన పి. కిరణ్ కుమార్ శాఖకు ఒక ఆదర్శమని ఆ శాఖ సంచాలకులు కెఎస్ విశ్వనాథన్ తెలిపారు.




విజయవాడ ఎన్టీఆర్ పరిపాలనా భవనంలోని కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు పి. కిరణ్ కుమార్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. 33 ఏళ్లపాటు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ శాఖ తరపున ఘనంగా సత్కరించారు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి**

కిరణ్ కుమార్ ఒకే సమయంలో విభిన్న విభాగాల బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించేవారని విశ్వనాథన్ కొనియాడారు. అవుట్‌డోర్ పబ్లిసిటీ, అడ్మినిస్ట్రేషన్, ఢిల్లీ విభాగాలు, ఫోటోగ్రఫీ, క్యాబినెట్ మీటింగ్ బ్రీఫింగ్స్, రిపబ్లిక్ డే శకటాల రూపకల్పన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించి తన ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. శాఖకు సంబంధించిన ప్రతి జీవో, రూల్స్ పూర్తి హిస్టరీని ఆయన వేళ్లపై ఉంచుకునేవారని తెలిపారు. అనేక చట్టాలు, నిబంధనల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు.

**ప్రతిభకు గుర్తింపు**

మీడియా మేనేజ్‌మెంట్, కవరేజ్ బాధ్యతలను ఎలాంటి లోపాలు లేకుండా కిరణ్ కుమార్ విజయవంతంగా పూర్తి చేశారని విశ్వనాథన్ ప్రశంసించారు. దేశ రాజధాని వేదికగా ఎంతో ఆకట్టుకున్న ఆంధ్రప్రదేశ్ ఏటికొప్పాక శకటం డిజైన్, ప్రదర్శన వెనుక ఆయన నిరంతర శ్రమ, సృజనాత్మకత దాగి ఉన్నాయని పేర్కొన్నారు. సుదీర్ఘ సర్వీస్‌లో ఉంటూనే లా, క్రిమినాలజీ వంటి మరెన్నో కోర్సులు చేస్తూ నిరంతరం తన నైపుణ్యాలను పెంపొందించుకున్నారని గుర్తుచేశారు. కిరణ్ కుమార్ లోని సినియారిటీ, సిన్సియారిటీని యువ సిబ్బంది అందరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

**త్రీడీ సూత్రంతోనే పని**

పదవీ విరమణ చేస్తున్న అదనపు సంచాలకులు పోతుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ డెడికేషన్, డివోషన్, డిటర్మినేషన్ అనే త్రీడీ సూత్రాలతోనే తాను పనిచేశానని, పీఆర్వోలకు జర్నలిజం పరిజ్ఞానం ఎంతో అవసరమని తెలిపారు. ఇక్కడ పనిచేయడం వల్లే నలుగురు రాష్ట్రపతులు, ముగ్గురు ప్రధానమంత్రులను కలిసే అరుదైన అవకాశం దక్కిందని గుర్తుచేసుకున్నారు. పుట్టపర్తి వేడుకలు, పుష్కరాల వంటి సమయాల్లో వివిధ ప్రణాళికలతో ట్రాఫిక్, మీడియా సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు వివరించారు. తన విజయాలన్నీ టీమ్ వర్క్ వల్లే సాధ్యమయ్యాయని చెప్పారు.

**ఘనంగా సత్కారం**

వెళ్ళిన ప్రతిచోటా చెరగని ముద్ర వేసేలా సిబ్బంది పని చేయాలని కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్లు ఐ. సూర్యచంద్రరావు, ఓ. మధుసూధన, కృష్ణా రెడ్డి, టి. నాగరాజ, డిప్యూటీ డైరెక్టర్లు పి. వెంకట్రాజ్ గౌడ్, డి. రమేశ్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఏఎస్ వీరభద్రరావు, పి. రాజశేఖర్, ఎంప్యానల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు నాగరాజు, శ్రీరామ్ యాదవ్, ప్రసాద్ కుమార్, కోటేశ్వరరావు, ఇతర జర్నలిస్ట్ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొని ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు.

## 'నైరుతి' రాక మరింత ఆలస్యం

మొదటి పేజీ తరువాయి

మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఇప్పుడప్పుడే ఉపశమనం లభించేలా కన్పించట్లేదు. నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమవుతోంది. జూన్ 4, 5 తేదీల్లో ఈ రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

వాస్తవానికి మే 26వ తేదీనే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని తొలుత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. కానీ, ఈ సారి ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందులయ్యాయి. రుతుపవనాలు నెమ్మదిగా కదులుతుండటంతో వీటి రాక ఆలస్యమవుతోంది. కేరళను తాకిన రెండు, మూడు రోజుల తర్వాత అవి తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. గతేడాది, అంచనా వేసిన సమయానికంటే ఎనిమిది రోజులు ముందుగానే మే 24న ఈ రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయి. ఆ తర్వాత మే 26న తెలంగాణలోకి ప్రవేశించాయి.

ఇదిలా ఉండగా.. ఈ ఏడాది సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు తక్కువ పడొచ్చని పేర్కొంది. ఇక, జూన్‌లోనూ యూపీ, హరియాణా, పంజాబ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

## జవాబుదారీతనం ఉండాల్సిందే..

మొదటి పేజీ తరువాయి

పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది.

అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది.

## కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు

మొదటి పేజీ తరువాయి

పరిశ్రమల వ్యర్థాలు నదిలో కలవకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కఠినంగా వ్యవహరించాలని, మురుగు నీటిని శుద్ధి చేశాకే నదిలోకి వదలాలని పవన్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ సామర్థ్యానికి తగిన విధంగా మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పీసీబీ మంజూరు చేసిన రూ.100 కోట్ల నుంచి కూడా నిధుల వినియోగించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. రోజువారీ 104 మిలియన్ లీటర్ల మురుగు నీరు జీవనదిని కలుషితం చేస్తోందన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు గోదావరిలో కలుస్తోందని పేర్కొన్నారు. పారిశ్రామిక వ్యర్థాల్లో ఆంధ్ర పేపర్ మిల్లు వెదజల్లే రోజువారీ కాలుష్యమే 32 మిలియన్ లీటర్లు ఉంటుందన్నారు. నిత్యం గోదావరిలో కలిసే 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనమని పేర్కొన్నారు. పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీలు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ద్వారా నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్‌కి కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలను అప్పగించారు.

## రూ.1500 కోట్ల భూమి కబ్జాకు వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా యత్నం:

మొదటి పేజీ తరువాయి

గండిపేట తహసీల్దార్ ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. డీసీపీ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. "గండిపేట సర్వే నంబర్ 18లో భూమి కబ్జాకు నకిలీ జీవోలు సృష్టించినట్లు గుర్తించాం. నకిలీ పత్రాలు తయారు చేసిన నిమ్మల రాజేశ్ గౌడ్, వేణుగోపాల్, సాయికిరణ్‌లను అరెస్ట్ చేశాం. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేశ్ పరారీలో ఉన్నారు. ప్రభుత్వం భూమి క్రమబద్ధీకరించిందంటూ ఫేక్ జీవోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తహసీల్దార్ ఫిర్యాదుతో విచారణ చేపట్టాం. చట్టబద్ధ హక్కులు లేకుండానే భూమి అమ్మకానికి కుట్ర చేశారు.

ఎకరా రూ.3.5 కోట్లకు విక్రయించేందుకు ఒప్పందాలు చేసుకున్నారు. కోర్టు ఆదేశాలతో నిందితుల ఇళ్లలో సోదాలు చేశాం. బ్యాంక్ పాసు పుస్తకాలు, మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నాం. ఈ అక్రమ భూ డీల్‌లో రూ.4కోట్లు చేతులు మారినట్లు గుర్తించాం. బొల్లా బ్రహ్మనాయుడి ఖాతా నుంచి రెండు విడతల్లో డబ్బు బదిలీ జరిగింది. ఆయన ఖాతా నుంచి రూ.1.25 కోట్లు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించాం. బొల్లా బ్రహ్మనాయుడిపై నార్సింగి పీఎస్‌లో కేసు నమోదు చేశాం" అని డీసీపీ తెలిపారు.

## కాసర్ల పద్మకు కెటిఆర్ నివాళి

మొదటి పేజీ తరువాయి

అనంతరం కాసర్ల పద్మ నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కాసర్ల పద్మకు ఘనంగా నివాళులర్పించారు. కాసర్ల పద్మ 2020లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అప్పటి మున్సిపల్ ఎన్నికల్లో 27వ కౌన్సిలర్‌గా పోటీ చేసినప్పటికీ ఆమె ఓడిపోయారు. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. పది రోజుల కిందట కాసర్ల పద్మ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆమెను కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆమె మరణించారు. పద్మ

మృతి పట్ల బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, పాలకవర్గం, పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. కాగా, ఆమెకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్దే ధ్యేయంగా పథకాలు అమలు

**- రాష్ట్రంలో ఎస్ హెచ్ జీ లకు బ్యాంక్ లింకేజ్ కింద 57 వేల కోట్ల రుణాలు పంపిణీ చేశాము**
**- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
**- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల కింద మెగా బ్యాంక్ లింకేజీ రుణాల మేళా**
**- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- బ్యాంక్ లింకేజ్ రుణాలు, ధాన్యం కొనుగోలు కమిషన్ చెక్కుల పంపిణీ**
**- వివిధ స్టాల్స్ ప్రదర్శన**

రాజన్న సిరిసిల్ల, మే -29 ప్రజా దివాస్

రాష్ట్రంలోని మహిళల ఆర్థిక అభివృద్దే ధ్యేయంగా పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల కింద మహిళా స్వయం సహాయక సభ్యులకు బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్కే ఫంక్షన్ హాల్ లో శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రుణాల పంపిణీ..337 సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ. 40 కోట్లు, ఎఫ్ పీసీ, ఎఫ్ పీజీ సీఐఎఫ్ కింద 42 సంఘాలకు రూ.1 కోటి ఐదు లక్షలు, శ్రీనిధి రూరల్ కింద 278 సంఘాలకు రూ.7 కోట్ల 13 లక్షలు, బ్యాంక్ లింకేజీ మెప్మా రుణాలు 55 సంఘాలకు రూ.6 కోట్ల 33 లక్షలు, శ్రీ నిధి మెప్మా 61 సంఘాలకు రూ. కోటి 50 లక్షల విలువైన చెక్కులను మహిళా సంఘాల బాధ్యులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించే సంఘాలకు రూ.11,36,113 కమిషన్ చెక్కును అందజేశారు. స్టాళ్లు ఏర్పాటు చేయగా, ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. మార్చి 6 వ తేదీన 99 రోజుల కార్యాచరణలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలపై వివరించడం.. భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు కార్యక్రమం కోసం ప్రభుత్వం ఈ కార్యాచరణ అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు 57 వేల కోట్లు బ్యాంక్ లింకేజ్ రుణాలు మంజూరు చేశామని వెల్లడించారు. రుణాలకు సంబంధించిన వడ్డీని తిరిగి చెల్లించామని తెలిపారు. ప్రతి మహిళను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రజా ప్రభుత్వం వివిధ పథకాలు, రుణాలను మంజూరు చేస్తుందని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 60 శాతం మహిళల సంఘాలకే ఇచ్చామని తెలిపారు. ప్రతి పథకంలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు వెళ్తున్నామని, ప్రజలను, మహిళలను భాగస్వా ములను చేసేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని పేర్కొన్నారు. కోటి మంది మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేశామని, సిరిసిల్ల లో 37వేల మందికి ఇస్తున్నామని వెల్లడించారు. రెండో దశలో కోటి చీరలకు ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. మహిళా సంఘాలకు మంజూరు చేసిన బస్సులతో ప్రతి నెలా రూ.68 వేల ఆదాయం వస్తుందని వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఉత్తమ పనితీరుతో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. మహిళా సంఘాలకు ఆద్వర్యంలో ఎరువుల షాపు లు ఇవ్వాలని, మహిళా సంఘాలకు ప్రతి మండలానికి ఒకటి రైస్ మిల్లు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్ లలో ఉచిత ప్రయాణం పథకం కేరళలో కూడా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. చక్కటి



సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రయోజనమే లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. రైతులకు ఒకే సారి రూ. రెండు లక్షల రుణ మాఫీ చేశామని, నూతన రేషన్ కార్డులు మంజూరు చేశామని, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఊపు అందుకున్నాయని పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణాలకు రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించడం ఎక్కడా లేదని స్పష్టం చేశారు. వచ్చే నెల జూన్ 2వ తేదీ తరువాత మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. మహిళలు రాజకీయ రంగంలోకి కూడా రావాలని సూచించారు. మన జిల్లా అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపి మిగతా జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. మార్చి 6 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. 10 థీమ్ లతో 10 శాఖల ఆద్వర్యంలో వివిధ కార్యక్రమాలను విజయ వంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. మహిళా సంక్షేమ వారోత్స వాల్లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, మహిళలపై లైంగిక వేధింపుల నివారణ నిషేధము పరిష్కారాల చట్టం 2013 వివిధ అంశాలపై అవగాహన కల్పించామని వెల్లడించారు. జిల్లాలోని మహిళా సంఘాలు తీసుకుంటున్న రుణాలు సద్వినియోగం చేసుకోవాలని, స్వయం ఉపాధి వైపు ఉపయోగించాలని పిలుపు నిచ్చారు.మహిళా స్వయం సహాయక సంఘాల ఎన్ పీఏ తక్కువగా ఉందని తెలిపారు. మన జిల్లా నుంచి ఉత్తమ అవార్డ్ తీసుకున్నామని గుర్తు చేశారు. బ్యాంక్ రుణాలను తినుబండారాలు, కిరాణా షాప్, మగ్గం వర్క్, ఇతర ఉపాధి పొందే వాటి కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంకా ప్రభుత్వ సబ్సిడీ పథకాలు ఉన్నాయని, వాటి వివరాలు సంబంధిత శాఖల వద్ద పొందాలని పిలుపు నిచ్చారు.జిల్లాలో ఆయా మండలాలకు కేటాయించిన బస్సులతో ప్రతి నెలా ఆదాయం వస్తుందని వివరించారు. సోలార్ ప్లాంట్, పెట్రోల్ బంక్ ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు మహిళా సంఘాల ఆద్వర్యంలో కొనసాగుతున్నాయని, విజయవంతంగా కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు.వృద్ధ మహిళలు, కిశోర బాలికలకు మహిళా సంఘాల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బ్యాంక్ ల కార్యకలాపాలు, అకౌంట్ తీయడంపై అవగాహన కిశోర బాలికలకు వస్తుందని, వారు సామాజిక అంశాలు, స్వయం సమృద్ధి తదితర అంశాలపై చర్చా చేయాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం మహిళలే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తుందని, స్కూల్ యూనిఫాంలు కుట్టించే బాధ్యత, అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మత్తు పనులు మహిళా సంఘాలతో చేయించామని వివరించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు ఏమైనా స్వయం ఉపాధి ఆలోచనలు, ఇతర సహాయం కోసం అధికార యంత్రాంగం సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివరించారు. కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు, వీర్నపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు. తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోగస్ ఓట్లను తొలగించేందుకు కార్యకర్తలు శ్రమించాలి: బీజేపీ జిల్లా కార్యదర్శి సురేంద్ర రావు

**- వేములవాడ రూరల్ బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ 'ఞ×=' ప్రోగ్రాంపై అవగాహన సదస్సు**
**- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యంపై వేములవాడ రూరల్ తాసిల్దార్ ఆఫీస్ ముట్టడి**

వేములవాడ / ప్రజాదివాస్ మే 29

వరి ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ వేములవాడ రూరల్ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా బీజేపీ రూరల్ మండల అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలు విషయమై తాసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించి పది రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున, రాష్ట్ర







ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు కొనుగోలు కేంద్రాల్లోని పూర్తి ధాన్యాన్ని వెంటనే సేకరించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.అంతకుముందు, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ (ఞ×=) ప్రోగ్రాంపై బీజేపీ రూరల్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాటి సురేంద్ర రావు మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న బోగస్ ఓట్లను గుర్తించి, వాటిని తొలగించేలా బూత్ అధ్యక్షులు, బీఎల్ఏ-2 (దీూా2) లు మరియు ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు జంకె మధు, సందేసరి సౌజన్య మల్లికార్జున్, మండల ప్రధాన కార్యదర్శి వనపర్తి పరశు రాములు, మండల ఉపాధ్యక్షులు లింగంపల్లి కుంటయ్య, నల్ల వెంకటరెడ్డి, నాయకులు లింగంపల్లి కిషోర్, జంగం వంశీ, సామోజి గౌతమ్, కొత్తపల్లి గంగాధర్, సారా నర్సయ్య, లింగంపల్లి రాజు, లింగంపల్లి రవీందర్, నేదురి లక్ష్మణ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిఘా నేత్రాలు సీసీ కెమెరాల ప్రారంభోత్సవం

ముస్తాబాద్/మే 29 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో స్థానిక ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు సీసీ కెమెరాలను తేదీ 30 -5-2026 రోజున ఉదయం 10 గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రారంభిస్తారని ఎస్సై గణేష్ తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సి సి కెమెరాల ఏర్పాటు వలన ప్రజల భద్రత శాంతి భద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ జరుగుతుందని వారన్నారు కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు యువకులు ప్రజలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు

# కోనరావుపేట ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



కొనరావుపేట మండలం / ప్రజాదివాస్ మే 29

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన మానుక సత్యం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన మానుక సత్యంకు ఎస్సై ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ఎస్సై ప్రశాంత్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ సమన్వయంతో ముందుకెళ్లాలని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొండాపూర్ ఓ అధికారి బదిలీతో ఊరంతా కదలిక

ముస్తాబాద్ /మే 29 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి గా గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించి పదోన్నతి పొంది బదిలీ అవుతున్న పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరావు మా ఊరు ప్రజల మనసును పొందడంతో వారి బదిలీ ఊరు ప్రజలందరినీ కదిలించింది రాజేశ్వరరావు బదిలీ మాట వినగానే గ్రామ ప్రజలందరూ తండోపతండాలుగా వచ్చి వారికి శాలువాతో ఘనంగా సత్కరించి మీ ఆత్మీయ మనసును మా ఊరు ప్రజల మనసుల్లో ఎల్లవేళలా ఉంటుంది అంటూ ఆ ఉద్యోగికి ఆడామగా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఆత్మీయ బంధంతో వీడ్కోలు పలికారు ఉద్యోగులు అంటే ప్రజల




మనసుల్లో గెలవాలి కానీ కొందరు ఉద్యోగులు మాత్రం అందుకు భిన్నంగా ఉంటారు ఉద్యోగ బాధ్యతను మరచి ఆర్థిక సౌభల్యం కొరకు ఆరాటపడుతుంటారు అభివృద్ధిని పక్కనపెట్టి ఏది ఏమైనా ఉద్యోగ ధర్మాన్ని మరువకుండా ప్రజలకు ఉన్నతమైన సేవలు అందించి అక్రమ సంపాదనను మరిచినప్పుడే నిజమైన నీతిపరునిగా ప్రజలు నీరాజనాలు పడతారు అలాంటి సమాజం కోసం ఉద్యోగులు తమ



వంతు కృషి చేసినప్పుడే గ్రామ మండల అభివృద్ధి పనులు సాధ్యమవుతాయని ఆకాంక్షిస్తారు అందుకు నిదర్శనంగా నీవు ఎంత సంపాదించావు అనేది కాదు ఎంతమంది గుండెల్లో నిలిచావు అనేది నిజం అదే ఈరోజు కొండాపూర్ గ్రామ ప్రజల నిలువెత్తు నిదర్శనం పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరావు అంకితభావంతో పని చేయండి అభివృద్ధిని కి సహకరించండి

# కరీంనగర్ పీఎంజే జువెలరీ దోపిడీ సూత్రధారి అరెస్ట్: సీపీ

- బిహార్ పూర్ణియా జైలు నుంచి పీటీ వారెంట్‌పై తరలింపు
- ప్రధాన నిందితుడు సుబోధ్ సింగ్ రిమాండ్
- వారం రోజులు పోలీస్ కస్టడీకి కోర్టులో పిటిషన్: సీపీ గౌష్ ఆలం

కరీంనగర్ జిల్లా ప్రజాదివాస్ మే 29



కరీంనగర్ నగరంలోని పీఎంజే జువెలరీ దుకాణంలో తుపాకులతో కాల్పులు జరిపి, భారీ దోపిడీకి పాల్పడిన కేసులో ఎట్టకేలకు ప్రధాన సూత్రధారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంచలన కేసులో ప్రధాన నిందితుడైన సుబోధ్ సింగ్‌ను కరీంనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం అధికారికంగా వెల్లడించారు. బిహార్‌లోని పూర్ణియా జైలులో శిక్ష అనుభవిస్తున్న నిందితుడు సుబోధ్ సింగ్‌ను కరీంనగర్ పోలీసులు ప్రత్యేక నిఘా నడుమ ఆరు పీటీ (ప్రొడక్షన్ ట్రాన్సిట్) వారెంట్‌పై ఇక్కడికి తరలించారు. అనంతరం అతడిని న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. ఈ దోపిడీ ఉదంతానికి సంబంధించిన పూర్తి వివరాలు, ముఠా నెట్‌వర్క్, మరియు కేసులో కీలక సమాచారాన్ని రాబట్టేందుకు నిందితుడిని వారం రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు కమిషనర్ వివరించారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిందితుడిని పట్టుకున్న పోలీస్ బృందాన్ని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు అభినందించారు.

# కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలి

- అపరల్ పార్క్, గోదాములు, రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్ వేగవంతంగా చేయాలి
- ధాన్యం తరలింపునకు సరిపడా వాహనాలు సమకూర్చాలి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



రాజన్న సిరిసిల్ల, మే -29 ప్రజా దివాస్

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధాన్యం సేకరణ, అన్ లోడింగ్ వేగవంతం చేయడం, అపరల్ పార్క్, గోదాములు, రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ శుక్రవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు వర్షం కారణంగా ధాన్యం తడవకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామనే భరోసా క్షేత్ర స్థాయిలో కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో మరింత వేగం పెంచాలని, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా సజావుగా పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న హమాలీలను ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయడం కోసం అపరల్ పార్క్ కు తరలించాలని, తద్వారా వాహనాలు తొందరగా అన్ లోడింగ్ జరిగి అవసరమైన కేంద్రాలకు వాహనాలను పంపడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేసేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు. వాహనాల కొరత లేకుండా సరైన పర్యవేక్షణ చేయాలని, సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా చూడాలని సూచించారు. తుది దశలో ఉన్న కొనుగోలు కేంద్రాలకు వాహనాలను పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# మహాలక్ష్మీ స్మార్ట్ కార్డులు : తెలంగాణలోని మహిళలకు అలర్ట్.. జూన్ 2నుంచి 'మహాలక్ష్మీ స్మార్ట్' కార్డులు..

హైదరాబాద్ / ప్రజాదివాస్ మే 29

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆధార్ కార్డు చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అయితే, ఇకనుంచి ఆధార్ కార్డు అవసరం లేకుండా ఉచితంగా ప్రయాణం సాగించొచ్చు.. కానీ, ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తీసుకొచ్చే 'మహాలక్ష్మీ స్మార్ట్ కార్డు'లను తీసుకోవాల్సి ఉంటుంది.రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 నుంచి మహిళలకు 'మహాలక్ష్మీ స్మార్ట్' కార్డులను జారీ చేయనుంది. పైలట్ ప్రాజెక్టుగా మొదట జిల్లాకొక మండలంలో కార్డులు జారీ చేస్తారు. కార్డులు వచ్చే వరకూ ఆధార్‌తో ప్రయాణించవచ్చు. అయితే, ఏటీఎం తరహాలో చిప్‌తో కూడిన స్మార్ట్ కార్డు జారీ చేస్తారు. ముందుగా ఆధార్ కార్డు, ఒక ఫొటో సేకరించి మహిళల ప్రాథమిక సమాచారం చిప్‌తో అనుసంధానిస్తారు. ఈ స్మార్ట్ కార్డులో లబ్ధిదారుడి పూర్తి వివరాలు.. ఫొటో, క్యూఆర్ కోడ్ ఉంటాయి. తర్వాత వారి పేర్లతో కార్డు జారీ చేస్తారు. అమల్లోకి వచ్చాక



స్మార్ట్ కార్డు చూపకుంటే ఉచిత ప్రయాణానికి అనుమతివ్వరు.మహాలక్ష్మీ స్మార్ట్ కార్డు వల్ల.. అర్హతలేని ప్రయాణికుల దుర్వినియోగాన్ని అరికట్టే అవకాశం ఉంటుంది. బతుకు తెరువు కోసం పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వలస వచ్చిన వేలాది మహిళా కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, నకిలీ ఆధార్ కార్డుల సాయంతో బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. దీనివల్ల ఆర్టీసీకి పెద్దమొత్తంలో ఆధాయానికి గండిపడుతోంది. స్మార్ట్ కార్డు అందుబాటులోకి వస్తే.. కేవలం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్నవారు మాత్రమే బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంటుంది.మహాలక్ష్మీ స్మార్ట్ కార్డుతో ప్రయాణ దూరం, మార్గాలు, సమయాలపై కచ్చితమైన సమాచారం ఉంటుంది. గ్రామం, మండలం, జిల్లా, జోన్ వారీ వినియోగ సమాచారం లభ్యం అవుతుంది. కండక్టర్లపై పనిభారం తగ్గుతుంది. పేపర్ టికెట్లులేని ప్రయాణంతోపాటు రద్దీ రూట్లు తెలుస్తాయి. బస్సులు పెంచడం, తగ్గించడం తేలికవుతుంది.అయితే, ప్రస్తుతానికి ఆర్టీసీలో విద్యార్థులకు రాయితీ, ఉద్యోగులకు, ఇతరులకు నెలవారీగా సీజన్ పాస్ అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఇదే తరహాలో మహాలక్ష్మీలకు స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించింది. అయితే, ఈ కార్డులను మీ సేవా, బస్ పాస్ కేంద్రాల్లో రూ.50 చెల్లించి తీసుకోవాలని సమాచారం.కార్డుల జారీ, దరఖాస్తు చేసుకునే విధానం, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవడానికి, సమీప కార్డుల జారీ కేంద్రాన్ని కనుగొనడానికి టీజీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి సమారాన్ని త్వరలో పొందుపరుస్తారు. కార్డులు అందే వరకు ఆధార్ కార్డు చూపించి మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు.

# రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- తడిసిన ధాన్యం సేకరణకు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- ఇప్పటి దాకా 80 శాతం సేకరణ పూర్తి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

తంగళ్ళపల్లి, మే - 29 ప్రజా దివాస్

తడిసిన ధాన్యం సేకరణ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, తూకం వేసి తరలించడానికి సిద్ధంగా ఉన్న బస్తాల వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ సారి వరి దిగుబడి, కొనుగోలు కేంద్రాలకు రాక పెరిగిందని, జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటి దాకా 80 శాతం కొనుగోలు చేశామని తెలిపారు. డీఆర్డీఓ, సహకార శాఖ, మెప్మా, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ ఇతర శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలు ధాన్యం, గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేసేలా మండలాలకు ప్రత్యేక అధికారులు, అన్ లోడింగ్ వద్ద అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కొనుగోళ్ల ప్రక్రియ పై ప్రతి రోజు ఉదయం అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తూ.. కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో కొంత వర్షం కురిసిందని, దీంతో తాను తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించానని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.



అపరల్ పార్క్, గోదాములకు తరలించి.. అక్కడ అన్ లోడింగ్ చేయిస్తున్నామని, హమాలీలకు నీరు, ఆహారం అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు వర్షం కారణంగా తడిసిన ధాన్యం సేకరణ విషయంలో ఇబ్బందులు లేవని, రైతులు ఈ విషయంలో ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు. తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను తరలించడానికి వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందని, సాధ్యమైనంత త్వరగా కొనుగోళు ృ పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.పరిశీలనలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు వాడకాన్ని నివారించేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

రాజన్న సిరిసిల్ల, మే - 29 ప్రజా దివాస్

జిల్లాలో పొగాకు వాడకం నివారించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ నెల 31వ తేదీ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి నిర్వహించారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వివిధ శాఖల వారు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పొగాకు



వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలని పేర్కొన్నారు.జిల్లాలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని, అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు మహిళలు, యువత, రైతులను భాగస్వామ్యం చేస్తూ పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలని ఆదేశించారు పొగాకు ఉత్పత్తుల చట్టం ప్రకారం 18 సంవత్సరాల కంటే చిన్న పిల్లలకు అమ్మడం నేరమని, ఈ చట్టాలు పకడ్బందీగా అమలయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, లేబర్ ఆఫీసర్ నజీర్ అహ్మద్, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష, ఎన్ జీ ఓ మెంబర్ భాస్కర్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదల విద్యభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కృషి చేస్తాయి

**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**- శత్రాజ్ పల్లిలో నూతన అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన విప్**





వేములవాడ / ప్రజాదివాస్ మే 29
చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదల విద్యభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కృషి చేస్తాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల్లో పాల్గొనీ వేములవాడ పట్టణంలోని శత్రాజ్పల్లి నూతన అంగన్వాడీ కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల ప్రణాళిక పెట్టుకొని ప్రతి వారం ఒక్కో శాఖ ఆధ్వర్యంలో గ్రామ, మండల, నియోజకవర్గ , జిల్లా స్థాయిలో పలు కార్యక్రమాలు చేస్తూ ముందుకు పోతున్నట్లు తెలిపారు...చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తాయని అన్నారు. గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు పోషకాహారం, ప్రాథమిక విద్య అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.పసిపిల్లలలో పోషకాహార లోపాలను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు చిన్నారులకు ప్రాథమిక విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడంలో అంగన్వాడీ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతోందన్నారు..పక్క భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని తెలిపారు..రాష్ట్రంలో విద్యా విధానంలో సమూల మార్పులు చేపడుతున్నట్లు తెలిపారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు అయిందని, రూ.200 కోట్లతో 20 ఎకరాల్లో నిర్మిస్తున్నామని వెల్లడించారు. నాణ్యమైన భోజనం, విద్య అందిస్తామని తెలిపారు.కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచామని, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు రానున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గానికి ఒకటి వస్తాయని, ఒక్కో స్కూల్ లో 1500 మంది విద్యార్థులు చదివే అవకాశం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 36 వేల బెడ్స్ ఆసుపత్రుల్లో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు

రైతు ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు.జగిత్యాల పొలాసా తరహాలో వేములవాడ నియోజకవర్గ పరిధిలో మర్రిపల్లి గ్రామంలో 40 ఎకరాల్లో నూతన రైతు విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసాం అన్నారు... తద్వారా రైతులకు నూతన వ్యవసాయ విధానంలో, నూతన వంగడాలతో రైతులు వ్యవసాయం చేసేలా ప్రోత్సాహకం అందజేయున్నట్లు తెలిపారు..శత్రాజ్పల్లిలో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రునీ తొందర్లోనే పూర్తి చేసుకొని త్వరలోనే ప్రారంభం చేసుకుందాం అన్నారు...

# కొనసాగుతున్న నిరవధిక సమ్మె మద్దతు తెలిపిన బిజెపి నాయకులు

ముస్తాబాద్/మే 29 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న వివో ల నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపిన మండల బిజెపి నాయకులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివో ల వారి యొక్క ఉద్యోగ భద్రత మరియు 20,000 రూపాయల కనీస వేతనం వంటి డిమాండ్ల కొరకు +ూ(58) ను సవరించి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు మరియు గుర్తింపు పొందిన వి ఏ ఓ లను సీసీ లు గా గుర్తించి పదోన్నతి కల్పిస్తూ ఆరోగ్య భద్రత బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వివో ల సభ్యులు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి సర్పంచులు నక్క దాసరి రవీందర్ మెంగని శ్రీనివాస్,ఉప సర్పంచ్లు కోల కృష్ణ నక్కల రాజు ,మండల ప్రధాన కార్యదర్శి మహేశ్వరి గోపి, చిట్టినేని శ్రీనివాసరావు, పద్మ ,వేణుగోపాల్, వరి వెంకటేష్, కార్తీక్, చిగురు వెంకన్న, బట్టు దీప,పద్మ, సాయి, వంశీ, తదితరులు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం**



రాజన్న సిరిసిల్ల, మే -29 ప్రజా దివాస్
జిల్లాలో జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, సంబంధిత అధికారులతో శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు పరేడ్ గ్రౌండ్ లో జరుగుతాయని, జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు , సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. వేడుకలకు సంబంధించి జెండా ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల డయాస్, సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేడుకల వద్ద వైద్య బృందాలచే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని. వేడుకలకు ఆహ్వాన పత్రాలు ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికీ అందాలని ఆదేశించారు. సిరిసిల్ల పట్టణంలోని స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథి అందించే సందేశం రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా తయారు చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ముఖ్య అతిథి గౌరవ వందనం, ఇతర బందోబస్తు ఏర్పాటు పకడ్బందిగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కలెక్టరేట్ ఏఓ రామ్ రెడ్డి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ముహూర్తం ఫిక్స్..




హైదరాబాద్ / ప్రజాదివాస్ మే 29
తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ముహూర్తం ఫిక్స్ చేసింది. జూన్ 1వ తేదీ నుంచి రెండో విడత ఇళ్లను ప్రారంభించనుంది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆ రోజున ఆసిఫాబాద్ జిల్లా కెరమరి మండలం కొఠారి గ్రామంలో రెండో విడత ఇళ్లను మంజూరు చేయనున్నారు. సెకండ్ ఫేజ్ కింద రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన చాలామంది పేదలు రెండో విడత ఇళ్ల కోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఎట్టకేలకు ప్రభుత్వం మంజూరు చేయనుండటంతో ఫుల్ ఖుషీ అవుతున్నారు.

**జూన్ 1న ముహూర్తం ఫిక్స్**

తొలి విడతలో మొత్తం 4.50 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిల్లో ఇప్పటికే లక్ష ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకోగా.. వీరికి రూ.6,500 కోట్లు చెల్లించారు. తొలి విడతలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున మంజూరు చేశారు. రెండో విడతలో నియోజకవర్గానికి 2 వేల చొప్పున 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. తొలి విడతలో పూర్తయిన లక్ష ఇళ్లకు జూన్ 1,2వ తేదీల్లో గృహప్రవేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక తొలి విడతలో మంజూరు చేసిన వాటిల్లో మరో 2 లక్షల ఇళ్ల నిర్మాణం కూడా తుది దశకు చేరుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. జూన్ 1వ తేదీన కొఠారి గ్రామంలో 28 మంది కొలాం ఆదివాసీలు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించుకున్న ఇళ్లకు రేవంత్ గృహప్రవేశం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర మంత్రులు పాల్గొననున్నారు.

**ప్రతీ ఒక్కరికీ రూ.5 లక్షలు**

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. విడతల వారీగా వీటిని నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తోంది. ఇంటి నిర్మాణం పూర్తయ్యే కొద్ది దశలవారీగా వీటిని అందిస్తోంది. అయితే 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్య ఇల్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న తర్వాత అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అనంతరమే నిజమైన లబ్దిదారులకు ఇళ్లను కేటాయిస్తున్నారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా ఇళ్లను మంజూరు చేస్తున్నారు. ఇక జీపీఎస్, ఏఐ టెక్నాలజీతో ఉపయోగించుకుంటూ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ కూడా ప్రవేశపెట్టారు. ఫిర్యాదులపై 24 గంటల్లోనే చర్యలు తీసుకుంటున్నారు. అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

# బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, ఫలితాలపై ప్రకారం చేయాలి**
**- విద్యార్థుల నమోదు శాతం పెంచాలి**
**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- బడిబాట 2026-27పై సన్నాహక సమావేశం**



రాజన్న సిరిసిల్ల, మే -29 ప్రజా దివాస్
బడిబాట కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.
ఈ విద్యా సంవత్సరం 2026 - 27కు సంబంధించి బడి బాటపై విద్యా శాఖ, వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. బడి బాట లో భాగంగా ఈ నెల 14వ తేదీ నుంచి వచ్చే నెల జూన్ 19వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే చేసి బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, ఎవరైనా డ్రాప్ అవుట్ ఉంటే వారిని కూడా చేర్పించాలని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి అంగన్వాడీ టీచర్ల సాయంతో అంగన్వాడి నుంచి ప్రతి విద్యార్థిని ప్రైమరీ స్కూల్ కు పంపాలని సూచించారు. అలాగే జిల్లా లేబర్ ఆఫీసర్ వర్క్ సైట్లలో ఎవరైనా బడి మానేసిన పిల్లలు ఉంటే వారిని బడికి పంపేలా చూడాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, మధ్యాహ్న భోజనం ఇస్తున్నామని వెల్లడించారు. ఈ సంవత్సరం నుంచి పిల్లలకు అల్పాహారం కూడా ప్రభుత్వం ఇవ్వనున్నదని తెలిపారు.సమావేశంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలో దారుణ ఘటన చోటు చేసుకుంది..

తంగళ్ళపల్లి మండలం / ప్రజాదివాస్ మే 29
భార్య సాహిన్‌ను భర్త షర్ఫుద్దీన్ హత్య చేశాడు...భార్యను చంపిన అనంతరం షర్ఫుద్దీన్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు..ఈ ఘటనతో మండేపల్లి గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది..సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు...కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు...మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు...ఈ ఘటనకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.





# కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలి

- అపరల్ పార్క్, గోదాములు, రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్ వేగవంతంగా చేయాలి
- ధాన్యం తరలింపునకు సరిపడా వాహనాలు సమకూర్చాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



ప్రజా దివాస్

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధాన్యం సేకరణ, అన్ లోడింగ్ వేగవంతం చేయడం, అపరల్ పార్క్, గోదాములు, రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ శుక్రవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు వర్షం కారణంగా ధాన్యం తడవకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామనే భరోసా క్షేత్ర స్థాయిలో కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో మరింత వేగం పెంచాలని, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా సజావుగా పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న హమాలీలను ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయడం కోసం అపరల్ పార్క్ కు తరలించాలని, తద్వారా వాహనాలు తొందరగా అన్ లోడింగ్ జరిగి అవసరమైన కేంద్రాలకు వాహనాలను పంపడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేసేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు. వాహనాల కొరత లేకుండా సరైన పర్యవేక్షణ చేయాలని, సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా చూడాలని సూచించారు. తుది దశలో ఉన్న కొనుగోలు కేంద్రాలకు వాహనాలను పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# రంగు రంగు బ్రోచర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల ను మోసం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు-బి ఆర్ ఎస్వి

- విద్యా అధికారి చర్యలు శూన్యం - పోతు అనిల్

ప్రజా దివాస్



వేములవాడ నియోజకవర్గ బి ఆర్ ఎస్వి నాయకులు పోతు అనిల్ మాట్లాడుతూ రంగు రంగు బ్రోచార్లు తయారు చేసి ఐఐటి. ఇతర విద్యా బోధనలు అంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసంచేస్తున్నాయిని కనీస వసతులు కల్పించకుండా ఆకర్షనియమైనా పేర్లు పెట్టి అధిక ఫీజులు వసూలు చేస్తుంటే అధికారులకు కనిపించడం లేదాని విద్యను వ్యాపార ధోరణిలా చేస్తుంటే మండల విద్యా అధికారి మాత్రం ఒక్కనాడు పాఠశాలల పాపాన పోలేదు ప్రతి ప్రైవేట్ పాఠశాలలు ఫీజ్ బోర్డు ఉపాధ్యాల విద్యా అర్హతలు బోర్డులు ఉంటేనే పాఠశాలలకు పర్మిషన్ ఇవ్వాలిని కనీసం ఆట స్థలం లేకుండా వున్న పాఠశాలల పర్మిషన్ రద్దు చేయాలని మాట్లాడారు..

# హైకోర్టులకు సుప్రీంకోర్టు పలు కీలక మార్గదర్శకాలు జారీ!

ప్రజా దివాస్

హైదరాబాద్: జస్టిస్ డిలేడ్,ఈజ్ జస్టిస్ డినైడ్, ఈ సూత్రాన్ని మరోసారి గుర్తు చేసింది సుప్రీం కోర్టు, ఈ క్రమంలో.. దేశవ్యాప్తంగా ఉన్న హైకోర్టులకు కీలక మార్గదర్శకాలు జారీ చేసింది, కేసుల విచారణ పూర్తయి, జడ్జిమెంట్ రిజర్వ్ చేసిన 3 నెలలలోపు ఖచ్చితంగా తీర్పు చెప్పాలని తేల్చి చెప్పింది. తీర్పుల వెల్లడిలో జరుగుతున్న ఆలస్యాన్ని అరికట్టేం దుకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాన్ని ప్రయోగించింది, రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తనకు సక్రమించిన అసాధారణ అధికారా లను ఉపయోగించి దేశంలోని అన్ని హైకో ర్టులకు కచ్చితంగా కట్టుబడి ఉండవల




సిన పలు కీలక మార్గ దర్శకాలను సుప్రీం కోర్టు శుక్రవారం జారీ చేసింది.. బెయిల్ ఉత్తర్వులను వీలైనంత వరకు మరు సటి రోజే ప్రకటించాల ని, అదే రోజు జైలుకు పంపాలని ఆదేశించిం ది. బెయిల్ వచ్చిన అండర్ ట్రయల్ ఖైదీలను అదే రోజు లేదా?మరుసటి రోజు కల్లా విడుదల చేయాలని తెలిపింది. తీర్పు రిజర్వ్ చేసిన తేదీని హైకోర్టు వెబ్‌సైట్‌లో స్పష్టంగా ప్రదర్శించాలని అంది.కోర్టులో ముఖ్యాంశం ప్రకటించిన 7 రోజుల్లో గా పూర్తి కారణాలతో కూడిన తీర్పును అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. 30 రోజుల్లోగా తీర్పు కార ణాలను వెబ్‌సైట్‌లో పెట్టకపోతే.. ఆ కేసు ను వేరే కొత్త బెంచ్‌కు బదిలీ చేయవచ్చునని తెలిపింది,ఈ ఉత్తర్వులను అన్ని హైకోర్టులకు చెందిన ప్రధాన న్యాయమూ ర్తుల ముందు ఉంచా లని రిజిస్ట్రార్ జన రల్స్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆలస్యమైన తీర్పు అనేది న్యాయమే కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది.

# సిరిసిల్లలో విషాదం.. బీ ఆర్ఎస్ కౌన్సిలర్ కాసర్ల పద్మ గుండెపోటుతో మృతి

ప్రజా దివాస్



సిరిసిల్లలో విషాదం నెలకొంది. 27వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. కరీంనగర్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి కాసర్ల పద్మ గెలుపొందారు. దీంతో కుటుంబసభ్యులు ఆమెను కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆమె మరణించారు.

# వేములవాడ రూరల్ బిజెపి మండల అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో SIR పై అవగాహన సదస్సు ఎమ్మార్వో ఆఫీస్ ముట్టడి

ప్రజా దివాస్

వేములవాడ రూరల్ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన =×= ప్రోగ్రాం పై కార్యకర్తలకు అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కార్యదర్శి గోపాటి సురేంద్ర రావు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో ఉన్న బోగస్ ఓట్లను గుర్తించి వాటిని తీసే విధంగా బూత్ అధ్యక్షులు దీూా2 లు ప్రతి ఒక బీజేపీ కార్యకర్త పని చేయాలని తెలిపారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగా రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ వేములవాడ రూరల్ పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దారు గారి కార్యాలయన్నీ ముట్టడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు పరమేష్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు విషయమై తాసిల్దారు గారికి వినతి పత్రం ఇచ్చి 10 రోజులు పూర్తవుతున్న ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని వర్షాలు కురిసే పరిస్థితులు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని లేనియెడల రాబోయే రోజులు బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు జంకె మధు సండే సారి మల్లికార్జున్ మండల ప్రధాన కార్యదర్శి వనపర్తి పరశురాములు మండల ఉపాధ్యక్షులు



లింగంపల్లి కుంటయ్య నల్ల వెంకటరెడ్డి లింగంపల్లి కిషోర్ జంగం వంశీ సామోజి గౌతమ్ కొత్తపల్లిగంగాధర్ సారా నర్సయ్య లింగంపల్లి రాజు లింగంపల్లి రవీందర్ నేదురి లక్ష్మణ్ బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# షోషల్ మీడియాలో జ్యోతిష్యం పేరుతో సైబర్ మోసాలు.. లక్షల్లో దోపిడీ!



ప్రజా దివాస్

ఆర్థిక కష్టాలు, కుటుంబ కలహాలు, వ్యాపార నష్టాలు వంటి సమస్యలతో సతమతమవుతున్న అమాయకులను లక్ష్యంగా చేసుకుని సైబర్ కేటుగాళ్లు ఆన్‌లైన్ జ్యోతిష్యం, తంత్ర సేవల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో నకిలీ ఖాతాలు తెరిచి, ఆకర్షణీయమైన ప్రకటనలు ఇస్తున్నారు.సంప్రదించిన వారి నుంచి ముందుగా తక్కువ మొత్తంలో ఫీజు వసూలు చేసి, ఆ తర్వాత దోష నివారణ పేరుతో విడతల వారీగా లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు.డబ్బులు ఇవ్వని వారిని వ్యక్తిగత వివరాలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ వేధిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది.

# జనగామ జిల్లా సర్పంచుల సంఘం కన్వీనర్ గా గోపగోని శ్రీధర్ గౌడ్.

- గ్రామాలను అభివృద్ధి పరచాలి.
- రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి.



ప్రజా దివాస్

తెలంగాణ పంచాయతీ సర్పంచుల సంఘం, తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ లో జరిగిన రాష్ట్ర సర్వసభ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాలకు అధ్యక్ష కార్యదర్శుల ఎన్నికల కొరకు జనగామ జిల్లా నుండి నర్మెట గ్రామ సర్పంచ్ గోపగోని శ్రీధర్ గౌడ్, ను తెలంగాణ పంచాయతీ సర్పంచుల సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు, చింపుల సత్యనారాయణ రెడ్డి, జనగామ జిల్లా సర్పంచుల సంఘం కన్వీనర్ గా ఏకగ్రీవంగా నియమించడం జరిగినది, ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆమోదంతో సర్పంచులుగా ఎన్నికైన గ్రామ సర్పంచులు అందరూ చైతన్యవంతులై గ్రామాలను అభివృద్ధి పరచాలని అన్నారు, కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచుల సంఘం జనగామ జిల్లా కన్వీనర్ గోపగోని శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఇంత మంచి గౌరవమైన బాధ్యతను అప్పగించిన రాష్ట్ర కమిటీకి జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలియపరుస్తూ తనతో ఏకగ్రీవంగా ఎన్నిక కాబడిన అన్ని జిల్లాల కన్వీనర్లకు శుభాకాంక్షలు తెలుపుతూ సర్పంచులమందరం సమన్వయంగా పనిచేస్తూ పార్టీలకు అతీతంగా ఏకమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి చట్టబద్ధంగా న్యాయబద్ధంగా మనకు రావలసిన నిధులను పథకాలను ప్రజలకు చేరవేస్తూ మన గ్రామాల అభివృద్ధి దిశగా ముందుకు సాగాలి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గంతో పాటు జనగామ జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్ తో పాడి గేదె మృతి...

ప్రజా దివాస్



సిరిసిల్ల లో గత రాత్రి రోజున గాలి దుమారానికి కరెంటు పోలు పడిపోయి సిరిసిల్ల డ్యాం కరగట్ట వద్దగల రైతు అంబేద్కర్ నగర్ నివాసి గడ్డం రాజు కి చెందిన బర్రెకు కరెంట్ షాక్ తగిలి మృతి చెందింది.బర్రె విలువ సుమారు 80,000 వరకు ఉంటుంది రైతు నష్టపోవడం జరిగింది అందువలన ప్రభుత్వం మరియు ఎన్ పి డి సి ల్ యాజమాన్యం ఆదుకోవాలని రైతు కోరుకుంటున్నాడు

# వివోఏల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్తాం

**తెలంగాణ రాష్ట్ర రక్షణ సేనట టిఆర్ఎస్ ) నాయకులు.. సంఘీభావం**

ప్రజా దివాస్




గంభీరావుపేట మండల కేంద్రంలో కొనసాగుతున్న నాలుగవ రోజు వివోఏల నిరసన దీక్షకు తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా మండల ఇన్చార్జిలు కూర సురేష్, వరద సతీష్, సుధాకర్ శర్మ, సుమలత శర్మ సంఘీభావం తెలిపారు. వివోఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేం దుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మండల విఓఏ ల సంఘం నాయకులు సంతోష మాట్లాడుతూ, రూ. 20వేల వేతనం చెల్లించాలని, అర్హులైన వివో ఏ లను సీసీలుగా పదోన్నతి కల్పించాలని, ఆరోగ్య భీమా తో పాటు తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివో ఏ లకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు మమత,కార్యదర్శి కీర్తి, కోశాధికారి భారతి, సహాయ కార్యదర్శి, ఇస్లావత్ పద్మ, మంజుల రజిత మయూరి లక్ష్మి, శిరీష, సంతోష, మేర పద్మ , పద్మా రెడ్డి,మల్లీశ్వరి, నవీన పాల్గొన్నారు.

# మాదిగల్లో అక్షరాస్యతను పెంచడం కోసం 40 రోజులు గో టు విలేజ్ కార్యక్రమం

**- ఎస్సీ వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకొని విద్యా ఉద్యోగాల్లో ముందుకు రావాలి.**

**- జులై 7 న వీ=రా ఆవిర్భవ దినోత్సవాన్ని మాదిగ జాతి పండుగగా జరుపుకోవాలి.**

**- మీ=రా జాతీయ నేత సిద్దిపేట జిల్లా ఇంచార్జి మంద కుమార్ మాదిగ.**

ప్రజా దివాస్

మాదిగ సామాజిక వర్గంలో డ్రాప్ అవుట్స్ ని తగ్గించి, విద్యా అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా మార్గనిర్దేశం చేసి అక్షరాస్యతను పెంపొందించడం కోసం వీ=రా ఆధ్వర్యంలో నేటి నుండి జులై 5 వరకు 40 రోజుల పాటు గో టు విలేజ్ ప్రోగ్రాం చేపట్టినట్లు సిద్దిపేట జిల్లా ఇంచార్జి మంద కుమార్ మాదిగ తెలిపారు .సిద్దిపేట నియోజక వర్గం ఎంఆర్పీఎస్ ఎంఎస్పీ అనుబంధ సంఘాల విస్తృత స్థాయి సమావేశం దీజీ= జిల్లా భవన్,లో జేరిపోతుల లక్ష్మణ మాదిగ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొన్న మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ " రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన ాజుజుజురాజ సర్వే నివేదికలో అక్షరాస్యతలో తీవ్రంగా వెనుకబడిన కులంగా మాదిగలు ఉన్నారని అన్నారు.అందువల్ల మాదిగలకు విద్యా యొక్క ప్రాముఖ్యతను వివరించి అక్షరాస్యతను పెంపొందించడం కోసం మంద కృష్ణ మాదిగ నిర్ణయం తీసుకొని ప్రతి గ్రామాల్లో చైతన్య సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.అందులో బాగానే గో టు విలేజ్ ప్రోగ్రాం చేపట్టినట్లు తెలిపారు.ప్రస్తుతం తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు జరుగుతున్నందున 9% రిజర్వేషన్ సదుపాయాలు మాదిగలు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఆర్థిక ఇబ్బందులూ, కుటుంబ సమస్యలు మొదలగు ఇబ్బందుల వల్ల మాదిగలు చదువులకు దూరం కావద్దు అని అన్నారు.అత్యంత పేదరికంలో ఉన్న మాదిగలు అభివృద్ధిలోకి రావాలంటే చదువు ఒక్కటే మార్గమని అన్నారు.ఉన్నత చదువుల కోసం అందుబాటులో ఉన్న అన్ని రకాల మార్గాలను ఉపయోగించుకుందాం అని అన్నారు. 30 ఏళ్లు పోరాటం చేసి సాధించిన వర్గీకరణ ఫలాలను అందుకొని ఉన్నత విద్యారంగంలో , ప్రభుత్వ ఉద్యోగాల్లో మాదిగ జాతి రాణించాలని పిలుపునిచ్చారు.మాదిగ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్న వీ=రా ఉద్యమం 32 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో నూతన జెండా గద్దెలని నిర్మాణం చేసుకోవాలని కోరారు.జులై 7



న మాదిగ జాతి పండుగగా వీ=రా జెండా పండుగ చేసుకోవాలని కోరారు.లను ఇంచార్జి లుగా నియమించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా కో ఇంచార్జి మల్లిగారీ యాదగిరి మాదిగ, ఎంఆర్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ముక్కపల్లి రాజు మాదిగ,ఎంట జిల్లా అధ్యక్షులు సామ్రాట్ ప్రకాష్,ఎంఎస్పీ జిల్లా నాయకులు,చుంచు రమేష్ మాదిగ,,కొలిమి మల్లేశం,చిన్నకోడూరు మండల అధ్యక్షులు మల్లిమరి రంగరాజ్యం మాదిగ ,ఎంఎస్పీ సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షులు రామగాళ్ల ప్రసాద్ మాదిగ,ప్రేంకుమార్ మాదిగ ,రంజిత్,మాదిగ రాములు మాదిగ,మరియు దుబ్బాక నియోజక వర్గం మరియు అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

# దగ్ధమైన ఈత వనాలను పరిశీలించిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్..

ప్రజా దివాస్

మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్, పెద్దాపూర్ గ్రామాలతో పాటు కోరుట్ల మండలం అయిలాపూర్, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో భారీ ఎత్తున ఈత వనాలు దగ్ధమవడంతో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరిశీలించారు..ఈ సందర్భంగా దగ్ధమైన ఈత వనాలను పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్, అగ్ని ప్రమాదం వల్ల జరిగిన నష్టంపై బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు..ఎన్నో సంవత్సరాల శ్రమతో పెంచుకున్న ఈత చెట్లు అగ్నికి ఆహుతి కావడం బాధాకరమని, ఈ ఘటన వల్ల గౌడ కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు.ప్రభుత్వం పరంగా అందాల్సిన సహాయాన్ని అందించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని





ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నష్టపోయిన వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. ఈత వనాలు జీవనాధారంగా ఉన్న కుటుంబాలు ఆందోళన చెందవద్దని, తాను ఎల్లప్పుడూ వారి వెంటే ఉంటానని భరోసా ఇచ్చారు...అగ్ని ప్రమాదాలకు గల కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు..బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు.

# వరి కొయ్యలు కాలుస్తూ రైతు అస్వస్థతతో మృతి

ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి గ్రామానికి



చెందిన రైతు ఎలుక నారాయణ (60) సంవత్సరాలు గురువారం తన పొలంలో వరి కొయ్యలు కాలుస్తుండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురై మృతి చెందారు.స్థానికుల సమాచారం మేరకు, ఎండ తీవ్రత మధ్య కొయ్యలు కాల్చుతున్న సమయంలో మంటలు ఒక్కసారిగా చెలరేగడంతో ఊపిరాడక ఆయన కుప్పకూలారు. సమాచారం అందుకున్న ఇల్లంతకుంట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పంట కోతల అనంతరం పొలంలో మిగిలిన కొయ్యలు కాలువడం వల్ల పొగ, వేడి ప్రభావంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.

# ఘనంగా గౌరీ నేని నాగేశ్వరరావు కార్యదర్శికి సన్మానం

**గత 6 సంవత్సరాలనుండి మా గ్రామాల్లో ఒక కుటుంబ సభ్యునిగా మా గ్రామాన్ని అభివృద్ధి బాటలో పనిచేశాడు చేశాడని గ్రామస్తులు ప్రజలు**

ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహించిన మన గౌరినేని రాజేశ్వరరావు ఈ రోజు విధి నిర్వహణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు వేరే గ్రామానికి బదిలీ అయితున సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు ఇన్ని రోజులు





మాతో ఉండి ఇప్పుడు మీరు వేరే చోటికి బదిలీ అవుతునదునా మాకు చాలా బాధగా ఉంది.ఇన్నాళ్లు మన ఊరికి ఎన్నో విధాలుగా సేవలు అందించినందుకు గాను ధన్యవాదాలు.మరుగున పడ్డ మా ఊరును ఒక తీరుకు తీసుకచిరు గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాలకు ఎంతగానో కృషి చేశారు.గ్రామంలో నీటి సమస్య అధిగమించడానికి ఎంతగానో కృషి చేశారు.కరోనా కష్టాలలో కూడా ఊరు బాగోగు కోసం ఎంతో కష్టపడ్డారు.ఇంకా చెప్పుకుంట పోతే చాలా ఉన్నాయి ఇలాంటివి.మీరు బదిలీ అయిన చోట కూడా ఇలాగే అందరితో మమేకమయ్యు ప్రజలకు సేవలు అందించాలని. వీధి నిర్వహణలో భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం కొండాపూర్ ప్రజలు,మరియు యువత.

# హైదరాబాద్ యూత్ అసెంబ్లీ యువత ఆదర్శం

**అమ్మ ఫౌండేషన్ కు సామాగ్రి అందజేత**

ముస్తాబాద్ /మే 29 ప్రజా దివాస్

హైదరాబాద్ యూత్ అసెంబ్లీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా, ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలోనీ అన్నపూర్ణ అమ్మ ఫౌండేషన్‌లో సేవాకార్యక్రమం నిర్వహించబడింది.రూ. 29,800/- వ్యయంతో చేపట్టిన ఈ కార్యక్రమం



సుస్థిర అభివృద్ధి లక్ష్యం -- 2 “ఆకలి నిర్మూలన” మరియు సుస్థిర అభివృద్ధి లక్ష్యం -- 3 “మంచి ఆరోగ్యం మరియు శ్రేయస్సు”కు అనుగుణంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా భోజన సేవలను సులభతరం చేయడానికి ప్లేట్లు, గ్లాసులు అందించగా, నివాసితుల సౌకర్యార్థం కుర్చీలు మరియు ఒక టేబుల్‌ను అందించారు.ఈ కార్యక్రమం ద్వారా సమాజ సేవ పట్ల యువత బాధ్యతను హైదరాబాద్ యూత్ అసెంబ్లీ సభ్యులు మరోసారి చాటిచెప్పారు

# వడ్లు జోకడం లేదని కాంటను ఎత్తుకెళ్లిన రైతులు

**- రైతులను ముప్పు తిప్పలు పెడుతున్న సెంటర్ నిర్వాహకుడు**

ప్రజా దివాస్

గన్నేరువరం మండలం చాకలివానిపల్లె డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రంలో సెంటర్ నిర్వాహకులు వడ్లు తూకం వేయడంలో జాప్యం చేస్తున్నారని. తూకంలో కోతలు విధిస్తున్నారని ఆగ్రహించిన రైతులు శుక్రవారం తూకం కాంటను ఎత్తుకెళ్లి గ్రామపంచాయతీలో పెట్టారు. గ్రామం పంచాయతీ ముందు రైతులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించి నెల రోజులు దాటిన కాంట పెడతలేరని మండిపడ్డారు. ఓవైపు వర్షాలు పడుతున్నాయని ఇంకెప్పుడు తూకం వేస్తారని, తూకం వేసిన బస్తాలను కాపాడేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తూకం వేసిన ధాన్యం మొలకెత్తి చెదలు పడుతున్నా సెంటర్ నిర్వాహకులు పట్టించుకోవడంలేదని, నిర్వాహకులకు పైసలు ఇచ్చి అనుకూలంగా ఉన్నవారికి వాళ్లు జోకుతున్నారని ఆరోపించారు. వెంటనే



ధాన్యం తరలించాలని రైతులు డిమాండ్ చేశారు.

# సందీప్ వంగా సినిమాల్లో హీరోయిన్స్ గ్లామర్‌కే పరిమితం కాదు : దర్శకుడు హేమంత్ మధుకర్



సందీప్ వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా షూటింగ్‌లో త్రిప్తి డిమ్రీ జాయిన్ అయ్యారు. అయితే ఆమె పాత్ర గ్లామర్‌కే పరిమితం అవుతుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మరో డైరెక్టర్ హేమంత్ మధుకర్ స్పందిస్తూ.. సందీప్ వంగా సినిమాల్లో హీరోయిన్ క్యారెక్టర్లు చాలా బలంగా ఉంటాయని అన్నారు. త్రిప్తి పాత్ర ప్రేక్షకులను కచ్చితంగా ఆశ్చర్యపరుస్తుందని పేర్కొన్నారు.

"సందీప్ రెడ్డి వంగా మహిళా పాత్రలను రాసే విధానాన్ని ప్రేక్షకులు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. ఆయన సినిమాల్లోని కొన్ని ఇంటిమేట్ సీన్స్ చూసి, హీరోయిన్‌కు కేవలం గ్లామర్ పాత్రలే ఇస్తారని అనుకుంటారు. కానీ మీరు నిశితంగా పరిశీలిస్తే.. సందీప్ మహిళలకు చాలా బలమైన, వైవిధ్యమైన పాత్రలను ఇస్తారు. 'అర్జున్ రెడ్డి' సినిమాలో శాలిని పాండే పాత్రను చూస్తే.. ఆమె ఎక్కువగా సింపుల్ కాస్ట్యూమ్స్‌లోనే కనిపిస్తూ చాలా హోమ్లీ ఇమేజ్‌తో ఉంటుంది. కానీ ఆ క్యారెక్టర్‌లో ఎంతో ఎమోషన్ ఉంది. అలాగే 'యానిమల్' సినిమాలో రష్మిక పాత్రను గమనిస్తే.. భర్తకు, కుటుంబానికి మధ్య జరిగే ఘర్షణలను తట్టుకునే ఒక బలమైన భార్యగా చూపించారు. 'యానిమల్' హీరో సెంట్రిక్ ఫిల్మ్ అయినప్పటికీ రష్మిక తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు" అని హేమంత్ అన్నారు.

"హీరో, హీరోయిన్, విలన్.. ఇలా అందరి పాత్రలను సమానంగా, పవర్‌ఫుల్‌గా రాయడంపైనే సందీప్ వంగా దృష్టి పెడతారు. ఇక 'స్పిరిట్' సినిమాలో దీపికా పదుకొణె స్థానంలో త్రిప్తి వచ్చారనే వార్తలను నేను పట్టించుకోను. ఈ రోజుల్లో దర్శకులు వారు రాసుకున్న పాత్రకు ఎవరు సరిపోతారో చూసి ఎంపిక చేసుకుంటారు. త్రిప్తి కచ్చితంగా అందరి అంచనాలను అందుకుంటారని నేను నమ్ముతున్నాను" అని హేమంత్ అన్నారు.

# నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చేసిన ధనుష్ కర




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన లేటెస్ట్ హీస్ట్ థ్రిల్లర్ మూవీ 'కర' తాజాగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లలో విడుదలైనప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రేక్షకాదరణ పొందలేకపోయింది. మంచి అంచనాల మధ్య రిలీజ్ అయిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మాత్రం పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది. ఇప్పుడు ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ నెట్‌ఫ్లిక్స్‌లో డిజిటల్ స్ట్రీమింగ్ జరుపుకుంటుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. అలాగే ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో కూడా స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో ఈ సినిమాను వీక్షించే అవకాశం దక్కింది.

'కర' సినిమాలో ధనుష్ తనదైన స్టైల్‌లో ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. హీస్ట్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో సస్పెన్స్, యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌ను మిళితం చేస్తూ దర్శకుడు విఘ్నేష్ రాజా కథను రూపొందించారు. అయితే కథనం నెమ్మదిగా సాగడం, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను పూర్తిగా ఎంగేజ్ చేయలేకపోవడం వంటి కారణాలతో థియేటర్లలో ఈ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ చిత్రంలో 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు హీరోయిన్‌గా నటించింది. ధనుష్‌తో ఆమె కెమిస్ట్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే ప్రముఖ నటులు సూరజ్ వెంజరాముడు, కేఎస్ రవికుమార్, జయరామ్ కీలక పాత్రల్లో కనిపించారు. వీరి నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. ముఖ్యంగా థ్రిల్లింగ్ సన్నివేశాల్లో ఆయన సంగీతం సినిమాకు మరింత ఉత్కంఠను తీసుకువచ్చింది.



## ఈ ప్రయాణంలో మీకు మీరే స్నేహితులు

కళా రంగమే కాదు.. మీరు ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనదే అంటోంది కథానాయిక ఐశ్వర్య రాయ్. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె చిత్రపరిశ్రమలో రాణించాలనుకున్నప్పుడు వ్యక్తిత్వానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత గురించి తన అభిప్రాయాన్ని పంచుకుంది. "నటిగా ఇప్పటికీ ప్రతిరోజు కొత్తగానే భావిస్తాను. సృజనాత్మకతతో కూడిన ఈ ప్రపంచంలో మనల్ని మనం వెతుక్కునే నిరంతర ప్రయాణం ఇది. అలాంటిది ఎవరికో సలహాలు ఇచ్చేంత గొప్ప స్థానంలో నేను ఉన్నానని అనుకోను. ప్రేక్షకులు నాపై చూపే ప్రేమ, ఆదరాభిమానాలకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినే. కానీ, కళా రంగమే కాదు.. ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనది. మీ అనుభవాలే మీకు జీవితంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోగలరో తెలుసుకునేందుకు సహాయపడతాయి. ఎందుకంటే ఒక్కొక్కరిది ఒక్కో రకమైన దృష్టి కోణం. నేను చెప్పాలని అనుకున్నదల్లా ఒక్కటే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో మీ చుట్టూ ఏం జరుగుతుందో మీరు ఊహించలేరు. ప్రతి విషయాన్ని ఒక ప్రణాళికతో కృత్రిమంగా చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. నిజమో కాదో తెలుసుకునేలోపే అంతా జరిగిపోతుంది. యువతరం ఇలాంటి వాటిని చూసి పక్కదారి పట్టకూడదు. బయటకు వెళ్లండి. మీ అభిరుచిని తెలుసుకోండి. మీ నిర్ణయాలతో నిజాయతీగా మెలగండి. ఆ ప్రయాణంలో మీకు మీరే మంచి స్నేహితులుగా నిలబడాలి. ఈ నకిలీ ప్రపచంలో ఫన్, మ్యాజిక్‌లతో పాటు ఒక వ్యక్తి ఏం చేయగలడో అనే వాటిని అన్వేషించేడంలో ఆనందం ఉండదు. ముందు సజీవంగా ఉండి జీవితాన్ని అర్థం చేసుకోవాలి. ఆ తర్వాత ఆ అనుభూతిని మీ కళలోకి తీసుకురావాలి. మీరు ఎవరనే దానికి నిజాయతీగా ఉండండి. అలానే నిత్య విద్యార్థిగా ఉంటూ మీతో మీరు నిజాయతీగా ఉండండి. సొంత అనుభవాలే మిమ్మల్ని ఒక మంచి నటుడిగా తీర్చిదిద్దుతాయి. వాటన్నింటినీ స్వీకరిస్తూ మీ ప్రయణాన్ని సాగించాలి. మిగిలినవన్నీ జరగాల్సిన సమయానికి అవే జరిగిపోతాయి, రావాల్సినవి వస్తాయి" అని చెప్పింది.

## ఇదంతా పబ్లిసిటీ కోసం కాదు!

వేరే పరిశ్రమకి వెళ్లినప్పుడు అక్కడి స్థానిక భాష మాట్లాడటం చాలా ముఖ్యమని, ఇదంతా పబ్లిసిటీ కోసం కాదని అంటోంది అందాల తార శ్రీలీల. భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకుల్ని అలరించే ఈ భామ.. తన డ్యాన్స్‌తో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె వివిధ ప్రాంతాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడం గురించి మాట్లాడింది. "నా విషయానికొస్తే... నేను ప్రతి భాషను గౌరవిస్తాను. పలు చిత్రపరిశ్రమల్లో అవకాశాలు అందుకుంటూ పనిచేస్తున్నా... కాబట్టి ఒక ప్రాంతానికి వెళ్లినప్పుడు తప్పకుండా అక్కడి భాషలోనే మాట్లాడతా. ఆ ప్రదేశానికి, అక్కడి భాషకు, ప్రజలకు ఇచ్చే గౌరవం అది. సినీతారలకు, ప్రేక్షకులకు మధ్య భాష ఒక భావోద్వేగ వారధిలాగా ఉంటుంది. అందుకే ప్రచార కార్యక్రమాల్లో స్థానిక భాషల్లో మాట్లాడటం వల్ల వారి మధ్య దూరం తగ్గుతుందనేది నా అభిప్రాయమ"ని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె హిందీలో కార్తిక్ ఆర్యన్‌తో ఓ ప్రేమకథా చిత్రంతో పాటు ధనుష్ నటిస్తున్న మరో సినిమాలో నాయికగా నటిస్తుంది.



# సింగిల్ మదర్‌గా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా

## మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్

24 ఏళ్ల వయసులో పెద్ద కుమార్తె రెనీని దత్తత తీసుకున్నప్పుడు ఎదుర్కొన్న విమర్శలను, ఇబ్బందులను బాలీవుడ్ నటి, మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్ తాజాగా గుర్తుచేసుకుంది. ఒక సింగిల్ మదర్‌గా తల్లి కావాలనే తన నిర్ణయం వల్ల కెరీర్ ముగిసిపోతుందని అందరూ భావించారని, చివరికి తన మేనేజర్ కూడా తనను వదిలేసి వెళ్లిపోయాడని ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గోన్న సుస్మితా సేన్ మాట్లాడుతూ.. 'నేను రెనీని దత్తత తీసుకున్నప్పుడు నా మేనేజర్ నన్ను వదిలి పారిపోయాడు. 'నీకు కెరీర్ పట్ల సీరియస్ నెస్ లేదు.. 24 ఏళ్లకే తల్లి అయిన వ్యక్తికి నేను మేనేజర్‌గా ఉండలేను' అని చెప్పాడు. అంతేకాదు, ఇకపై నాకు హీరోయిన్‌గా అవకాశాలు రావని, కేవలం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానే మిగిలిపోతానని చాలామంది హెచ్చరించారు అని సుస్మితా చెప్పుకోచ్చింది. అయితే తనకు పరిశ్రమ నుంచి ఎలాంటి మద్దతు లభించనప్పటికీ, మాతృత్వమే తనను మరింత బలోపేతం చేసిందని సుస్మితా చెప్పారు. కూతురు వచ్చిన తర్వాతే నా కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ సినిమాలు ఇచ్చాను. రెనీని దత్తత తీసుకున్న తర్వాత 'ఆంఖే', 'మై హూ నా', 'మైనే ప్యార్ క్యూ కియా' వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించాను. ఇటీవలి కాలంలో 'ఆర్య' వెబ్ సిరీస్, 'తాలి' బయోపిక్‌లతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా తన నటనతో అలరించాను అంటూ సుస్మితా చెప్పుకోచ్చింది. ఇక సుస్మితా



సేన్ జీవితంలో మాతృత్వానికి ఎప్పుడూ మొదటి స్థానమే ఉంటుంది. 2010లో ఆమె 'అలీషా' అనే మరో అమ్మాయిని కూడా దత్తత తీసుకున్నారు. వీరిద్దరితో కలిసి తనదైన ఒక అందమైన ప్రపంచాన్ని నిర్మించుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. సుస్మితా పెద్ద కుమార్తె రెనీ కూడా ప్రస్తుతం యాక్టింగ్ రంగంలోకి అడుగుపెట్టారు. భయం లేకుండా, ఒదిగి ఉండటాన్ని తన తల్లి నుంచే నేర్చుకున్నానని రెనీ పలు సందర్భాల్లో చెప్పారు. 1994లో మిస్ యూనివర్స్ కిరీటాన్ని గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించిన సుస్మితా సేన్, ఆ తర్వాత తన వ్యక్తిగత నిర్ణయాలపై వచ్చిన విమర్శలను ఏమాత్రం లెక్కచేయకుండా, అనుకున్నది సాధించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు.